క్లుప్తంగా

వృత్తి విద్యలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



అవగాహన ర్యాలీలో పాల్గొన్న మాడుగుల కేజీబీవీ విద్యార్థినులు

మాడుగుల : చదువుతో పాటు వృత్తి విద్యల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మాడుగుల కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం.విజయ అన్నారు. గురువారం పాఠశాలలో వృత్తి విద్యా కోర్సులపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వృత్తి విద్యల పట్ల ఆసక్తి చూపుతున్న విద్యార్థులను ఎంపిక చేసి వారిని పారిశ్రామిక ప్రాంతాలకు తీసుకెళ్లి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఒకేషనల్ ట్రైనర్ జి.దేవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కె.జె.పురంలో సంతోషిమాత తీర్థం



కె.జె.పురం జంక్షన్‌లో సంతోషిమాత ఆలయం

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో గల సంతోషిమాత అమ్మవారి తీర్థం శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లి నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి కుంకమ పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. ఆలయం వద్ద కబడ్డీ, సైకిల్, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్నసమారాధన, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమమాలు జరుగుతాయని తెలిపారు.

గిరిప్రదక్షిణ విజయవంతానికి పిలుపు



నల్లగొండమ్మ తల్లి

నాతవరం : భక్తులు ఆరాధ్య దైవంగా పూజించే తాండవ నల్లగొండమ్మ తల్లి ఆలయం చుట్టూ ఈ నెల 24న గిరి ప్రదక్షిణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రదక్షిణ తాండవ జలాశయం దిగువనున్న ఆలయం నుంచి మొదలై ఆడాకుల, తాండవ స్పిల్‌వే గేట్లు, జాలారిపేట మీదుగా సాగుతుందన్నారు. భక్తులు పాల్గొని ప్రదక్షిణను విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యేను సన్మానించిన జిల్లా కమిటీ సభ్యులు



ఎమ్మెల్యే గణేష్‌ను సత్కరిస్తున్న జిల్లా కమిటీ సభ్యులు

నర్సీపట్నం : నూతనంగా నియమితులైన జిల్లా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను గురువారం సత్కరించారు. బీసీ సెల్ జిల్లా సెక్రటరీగా నియమితులైన పాము అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా జాయింట్ సెక్రటరీ సుర్ల రమణ, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ విభాగం సెక్రటరీ జాగు రామకృష్ణ ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.ఈ కార్యక్రమంలో పెద్దిరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బుచ్చెయ్యపేట : మండలంలో గల మూడు గ్రామాల్లో అంగన్‌వాడీ ఆయా పోస్టులను ఓపెన్ కేటగిరీలో భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీవో ఉషారాణి తెలిపారు. నేతవానిపాలెం, పీపీ అగ్రహారం-2, ఎం.భూపతిపాలెం గ్రామాల అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు పదవ తరగతి పాసై, స్థానికులై, వివాహితులై ఉండాలన్నారు. జులై 2023 నాటికి 21 నుండి 35 సంవత్సరాల లోపు వయస్సున్న ఓసీ అభ్యర్థులు అర్హులన్నారు. వారు ఈ నెల 23 నుండి 29లోగా పోస్టు ద్వారా గాని లేదా రావికమతం ఆఫీసులో గాని దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలకు

కష్టం అని భావించక ఇష్టంగా చదువుకుంటే విద్యార్థులు పరీక్షల్లో చక్కటి ఫలితాలు పొందవచ్చని పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు హితబోధ చేశారు. గురువారం పలుచోట్ల టెన్త్ విద్యార్థుల ఫేర్‌వెల్ వేడుకలు కన్నులపండువగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులంతా పరీక్షల్లో శాతశాతం ఉత్తీర్ణత సాధించాలని అంతా అభిలషించారు.

- టెన్త్ విద్యార్థుల ఫేర్‌వెల్ వేడుకల్లో ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు



ఎ.కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం స్వర్ణలతతో టెన్త్ విద్యార్థినులు



కింతాడ కేజీబీవీ పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈవో సత్యనారాయణ

కె.కోటపాడు : పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులందరు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ బి.చిన్నమ్మలు అన్నారు. కింతాడలోని కేజీబీవీ పాఠశాలలో పది, ఇంటర్ ద్వితీయ విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు చదువే ఉన్నత లక్ష్యాల సాధనకు తోడ్పడుతుందని గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎంఈవో సత్యనారాయణ, సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ, ఎంపీటీసీ పల్లా కన్నమ్మ, పల్లా రాజేష్, పీఎంసీ కమిటీ చైర్మన్ భూలోక, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

ఎ. కొత్తపల్లి హైస్కూల్లో..

దేవరాపల్లి : ఎ. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో ప్రధానోపాధ్యాయురాలు వై. స్వర్ణలత ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సభ ఉత్సాహంగా జరిగింది. ఈ వీడ్కోలు సభలో స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి టెన్త్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సందేశాత్మక నాటికల వంటి సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పండూరి సరువునాయుడు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పెదిరెడ్ల అప్పారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కస్తూర్బా పాఠశాలలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ

విద్యకు అధిక ప్రాధాన్యం

మాకవరపాలెం: విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ అన్నారు. స్థానిక కస్తూర్బా పాఠశాలో పది, ఇంటర్ విద్యార్థులతో ఫేర్‌వెల్ డే వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కార్పొరేట్‌కు దీటుగా విద్య అందించేందుకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ పెట్ల భద్రాచలం,ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి, పాఠశాల ఎస్‌వో త్రివేణి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బాబ్జీ పాల్గొన్నారు.

చురుగ్గా పోలీస్‌స్టేషన్ల అదనపు భవనాల నిర్మాణం



నాతవరంలో తుది దశకు చేరుకున్న నూతన భవన నిర్మాణం

నాతవరం : మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌కు అదనపు భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ పనుల కోసం ప్రభుత్వం రూ 2. కోట్ల 50 లక్షలు మంజూరు చేసింది. వచ్చే ఉగాది నాటికి భవనాన్ని ప్రారంభించేందుకు పోలీసు కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ప్రయత్నిస్తున్నారు. నర్సీపట్నం సబ్ డివిజన్ పరిధి నాతవరం, గొలుగొండ, కృష్ణదేవిపేట పోలీసు స్టేషన్లు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రభుత్వం నూతన భవనాలు మంజూరు చేసింది. ఒక్కో దానికి రూ. 2 కోట్ల 50 లక్షలు చొప్పున నిధులు కేటాయించింది. నాతవరం పోలీస్ స్టేషన్ నూతన భవనం పనులు పెయింటింగ్ దశకు చేరుకున్నాయి. కృష్ణదేవిపేటలో వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. కొత్తగా నిర్మించే భవనాలు విశాలంగా స్టేషన్ సిబ్బందికి సౌకర్యవంతంగా నిర్మించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదీదారుల నిరీక్షణ, కౌన్సెలింగ్‌కు వీలుగా కొత్త భవనాల్లో వసతులు ఉన్నాయి.

నేడు వలంటీర్లకు సన్మానం

బుచ్చెయ్యపేట : మండలంలో గల రాజాం సచివాలయంలో శుక్రవారం వలంటీర్లకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటాచార్య తెలిపారు. తురకలపూడి, రాజాం, ఆర్.శివరాంపురం, తైపురం, మల్లాం సచివాలయాల పరిధిలో ఉన్న అన్ని గామాల వలంటీర్లకు మధ్యాహ్నం 2 గంటలకు ప్రభుత్వం అందజేసిన ప్రోత్సాహ నగదు అందించి, సత్కరిస్తారన్నారు. అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ముఖ్య నాయకులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని తెలియజేశారు.

జగనన్న సంక్షేమ సైన్యం వలంటీర్లు



రావణాపల్లిలో వలంటీర్లను సన్మానిస్తున్న నాయకులు



వి.బి.పేటలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ జయమ్మ తదితరులు


చీడికాడ : ప్రజల కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ సైన్యం వలంటీర్లే అని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. మండలంలోని వి.బి.పేట సచివాలయంలో వలంటీర్ల సేవలను కొనియాడి, దుశ్శాలువాలతో వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లె నిద్రలేవక ముందే వలంటీర్లు తలుపు తట్టి పెన్షన్లు, సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరిస్తు కుటుంబ సభ్యులుగా మారారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, సర్పంచ్‌లు వంటాకు నర్సింహమూర్తి, కన్నూరి సత్యవతి, చెల్లంనాయుడు పాల్గొన్నారు.

రావణాపల్లిలో..

గొలుగొండ : రావణాపల్లి గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న రావణాపల్లి, కొమిర గ్రామాల్లో గురువారం వలంటీర్లను గ్రామ సచివాలయం వద్ద సత్కరించారు. అనంతరం చోద్యం పీఏసీఎస్ అధ్యక్షుడు కిపపర్తి పెద్దిరాజు, కొమిర సర్పంచ్ రాజుబాబు, ఏఏసీ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం వలంటీర్లతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి అప్పారావు, గ్రామ సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి కేరాఫ్ అడ్రస్ టీడీపీ నాయకులు

- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆరోపణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చోడవరం : టీడీపీ నాయకులు అవినీతికి కేరాఫ్ అడ్రస్ అని వైస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. చోడవరం పార్టీ కార్యాలయంలో డీసీఎంఎస్ చైర్మన్ వల్లా నర్సింగరావు, జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు గురువారం విలేకరులతో మాట్లాడారు. చోడవరంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని ప్రగల్భాలు పలుకుతున్న టీడీపీ నాయకులు చర్చకు రావాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక సంక్షేమం, అభివృద్ధిపై సచివాలయాల్లో పూర్తి వివరాలతో బోర్డులు పెట్టామని, టీడీపీ నాయకులకు దమ్ముంటే వారు చేసిన అభివృద్ధిపై గ్రామాల్లో బోర్డులు పెట్టి బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనుల పేరుతో బుచ్చెయ్యపేట, చోడవరం, రావికమతం, రోలుగుంట మండలాల్లో టీడీపీ నాయకులు ఇసుక మాఫియా నడిపి లక్షలు సంపాదించుకున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చాక ఎటువంటి అవినీతి, లంచాలు లేకుండా నేరుగా ప్రభుత్వ పథకాలు వలంటీర్ల ద్వారా ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని రూ. 150 కోట్ల అప్పుల్లోకి నెట్టింది అప్పటి టీడీపీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు కాదా అని ప్రశ్నించారు. ఆయనకు అప్పటి ఎమ్మెల్యే రాజు, ప్రస్తుతం ఆ పార్టీ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు మద్దతు ఇవ్వలేదా అని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పైన, స్థానిక ఎమ్మెల్యే పైన లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, తప్పుడు ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, దంతులూరి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎం. కోడూరులో బీజేపీ ప్రజాపోరు యాత్ర

మాడుగుల రూరల్ : బీజేపీ ప్రజా పోరుయాత్ర-2ను గురువారం ఎం. కోడూరు గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. మండలంలో తాటిపర్తి, శంకరం తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. అప్పలకొండ కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి మేడపు రెడ్డి శ్రీనివాస్, ప్రజాపోరు నియోజకవర్గ ఇన్‌చార్జి మండల సతీష్, మండల పార్టీ అధ్యక్షుడు ఉందూరు రాజు, ప్రధాన కార్యదర్శి మట్టా చంటి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్‌తో మెరుగైన వైద్య సేవలు

కె.కోటపాడు : సూర్రెడ్డిపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం గురువారం నిర్వహించారు. గ్రామానికి చెందిన 156 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులిచ్చారు. ఏఎన్‌ఎంలు బీపీ, షుగర్ పరీక్షలతో పాటు గర్భిణులకు తనిఖీలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, అచ్చియ్యమ్మ, రమణ, చిన్నమ్మలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్‌లో..

మాడుగుల రూరల్ : మాడుగుల ఆరోగ్య కేంద్రం-1 పరిధి దొర్ల వీధిలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాద్‌పాత్రుడు 76 మందికి పరీక్షలు నిర్వహించారు. అలాగే పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సహాయకుడు శ్రీనివాసరావు, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

డి. గొటివాడ రోడ్డు పనుల పరిశీలన



డి. గొటివాడ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ రాజారామ్ తదితరులు

మాడుగుల : మండలంలో డి.గొటివాడ నుండి సాగరం కాలనీ వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను గురువారం ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ పరిశీలించారు. సుమారు 18 గిరిజన గ్రామాలకు మండల కేంద్రానికి రావడానికి ప్రధాన ఆధారంగా ఉన్న రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు కృషి ఫలితంగా నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు తలారి అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కాత వెంకట రమణ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ



విద్యార్థులకు పరీక్ష అట్టలు అందజేస్తున్న అతిథులు

దేవరాపల్లి : ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 120 మంది పదవ తరగతి విద్యార్థులకు దేవరాపల్లికి చెందిన కోసూరి రవి శంకర్ తన తండ్రి సత్యనారాయణ జ్ఞాపకార్థం సొంత సొమ్ముతో పరీక్ష అట్టలు సమకూర్చారు. ఈ సందర్భంగా జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు కె.వి. రమణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా సీఎం జగన్ తీర్చిదిద్దారన్నారు. ఎంఈవో-1 బి.పడాల్‌దాస్, ఎంఈవో-2 వి. ఉషారాణి, జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు కె.వి. రమణ, ఉగ్రూకుల అప్పారావు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల కన్వీనర్ కొరుపోలు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

చోడవరం : చోడవరం శ్రీ కేశవస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. స్వామివారి 751వ వార్షిక కల్యాణ బ్రహోత్సవాల సందర్భంగా శ్రీ మహాలక్ష్మీదేవికి సామూహిక కుంకుమార్చన చేశారు. సుమారు 300 మంది మహిళలు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుదర్శనం సీతారామాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి.

శరభవరంలో నేడు 'జగనన్న సురక్ష'

రోలుగుంట : గ్రామస్థాయిలో ప్రభుత్వం నిర్వహించగలపెట్టిన రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం నేడు శరభవరంలో నిర్వహించనున్నట్లు ఈవోపీఆర్డీవో కె. నూకరాజు తెలిపారు. పలు విభాగాల స్పెషలిస్ట్ వైద్యులు హాజరై ఉచిత పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న కుటుంబాలతో ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: పక్షవాతం, క్యాన్సర్‌తో బాధపడుతున్న కుటుంబాలకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు గురువారం అందజేశారు. మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లికి చెందిన సంగిన సూరిబాబుకు రూ.2 లక్షలు, మేకా శివకు రూ.1 లక్ష, అంగర వీరబాబుకు రూ.1 లక్ష చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, పార్టీ నాయకులు బేతిరెడ్డి విజయ్, కిల్లాడ శ్రీనివాసరావు, నిర్జోగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్లు



రిజిస్ట్రేషన్ ఉపయోగాలను లబ్ధిదారులకు వివరిస్తున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

నాతవరం : జగనన్న కాలనీ లేఅవుట్లలో ఇళ్ల స్థలాలకు ముమ్మరంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ తెలిపారు. గురువారం శృంగవరం, నాతవరం సచివాలయాల్లో లబ్ధిదారులకు అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముమ్మరం చేశారు. లబ్ధిదారులు సొంతంగా రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలంటే ఆర్థికంగా ఇబ్బంది పడాలన్నారు. రిజిస్ట్రేషన్లు చేసుకున్న లబ్ధిదారులు బ్యాంకు రుణాలు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. కొన్ని సచివాలయాల్లో సాంకేతిక సమస్యల కారణంగా రిజిస్ట్రేషన్లలో జాప్యం జరగడంతో కోటవురట్ల సబ్ రిజిస్ట్రార్ నర్సింహమూర్తి స్వయంగా పరిశీలించి సరి చేయడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, వీఆర్వో బొత్స శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారిణికి ఎమ్మెల్యే గణేష్ అభినందన



రాజేశ్వరి, ప్రియాంకను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం : నేషనల్ బాక్సింగ్ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించిన క్రీడాకారిణి బొమ్మల రాజేశ్వరిని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ గురువారం అభినందించారు. బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బెంగళూరులో ఈ నెల 13 నుండి 20 వరకు నేషనల్ బాక్సింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో రాజేశ్వరి 50 కిలోల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించింది. వూషూ మహిళా కోచ్ కోర్సులో ఏ గ్రేడ్ సాధించిన వేపాడ ప్రియాంకను కూడా ఎమ్మెల్యే అభినందించారు. డైరెక్టర్లు, సీనియర్ కోచ్ యర్రా శేఖర్ పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యం మెరుగుపడేలా బోధన ఉండాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న శ్రీకాకుళం డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ భారతమ్మ

కె.కోటపాడు : విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం మెరుగుపరిచే విధంగా ఉపాధ్యాయులు బోధించాలని శ్రీకాకుళం డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.భారతమ్మ అన్నారు. మండలంలో కొరువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం రాష్ట్ర స్థాయి అభ్యసనా బృందం సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ బృందంలో సభ్యురాలైన భారతమ్మ మాట్లాడుతు చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించి, సులభరీతిలో వారికి అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, భీమిలి డైట్ కళాశాల అధ్యాపకుడు త్రినాథ్, పరిశీలకులు రాంబాబు, రామ్‌నాథ్, ప్రధానోపాధ్యాయురాలు కె.కమలాకుమారి పాల్గొన్నారు.

పిండ మార్పిడితో మేలు జాతి పశువుల ఆవిర్భావం

మాడుగుల : పాడి పశువులకు పిండ మార్పిడి ఇంజక్షన్లు వేయడం ద్వారా అంతరించిపోయే దేశీయ పశుజాతిని కాపాడుకోవచ్చని ప్రాంతీయ పశు వైద్యశాల ఏడీ వి.చిట్టినాయుడు అన్నారు. గురువారం మండలంలో పిండ మార్పిడి ఇంజక్షన్లు వేసే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మాడుగుల మండలం కింతలి పశు వైద్యశాల వైద్యాధికారి నరేష్ నెల్లూరు జిల్లా చింతలదీవి కామధేను ప్రాజెక్టులో పిండ మార్పిడి పద్ధతిపై శిక్షణ పూర్తి చేసుకుని వచ్చారన్నారు. దీనిలో భాగంగా కింతలి గ్రామానికి చెందిన దామరౌతు రాజునాయుడుకు చెందిన సంకరజాతి జెర్సీ పశువుకు, ఒంగోలు జాతి పిండాన్ని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలతో ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమం చేపడుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి, రైతులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నల్లమారమ్మ జాతర



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

మాకవరపాలెం : నల్లమారమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొండల అగ్రహారంలో ఏటా ఈ వేడుక వైభవంగా నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానికులంతా అత్యంత ఘనంగా జాతరను జరుపుకున్నారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్నసమారాధన ఏర్పాటు చేశారు. దీనిలో వేలాదిగా భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. రాత్రికి బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గూడూరు వెంకటరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నీటి వినియోగంపై మహిళా సంఘాలకు శిక్షణ



శిక్షణ అనంతరం ప్రతిజ్ఞ చేస్తున్న శిక్షకులు, అధికారులు

రోలుగుంట : వేసవిలో పుష్కలంగా తాగునీరు అందించాలనే ప్రభుత్వ లక్ష్యం కోసం మహిళా సంఘాల సభ్యులు కృషి చేయాలని కమ్యూనిటీ కాంట్రాక్ట్ జిల్లా కో ఆర్డినేటర్ ఆర్.నారాయణ అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటి పంపిణీపై మహిళా సంఘాలకు ఒక రోజు శిక్షణను నీటి సరఫరా, పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అనంతరం అందరికీ తాగునీరు అందిద్దాం, జల్‌జీవన్ మిషన్ పథకం అమలుకు బాధ్యత వహిద్దామంటూ ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాజు, వెలుగు ఏపీఎం సాధన ప్రతిజ్ఞ చేయించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నర్సీపట్నం: పెదబొడ్డేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా పోల్స్ మార్పుతున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.